


# అలకపానుపు

**- పి. వి. రమణారావు**

'పందిట్లో పెళ్ళవుతున్నదీ కను విందవుతున్నదీ' ప్రేమ లేఖలు సినిమాలోని పాటని బేండ్ మేళం వారు హోరెత్తించేస్తున్నారు. అంత్యాక్షరీ గాన ప్రవీణులైన వధూ వరులకి ఆ పాట అంతు చిక్కలేదు. వరుడు పీతాంబర్ పక్కకు వంగి, వధువు శ్వేతాంబరి చెవిలో ఏవో గుసగుస లాడాడు. వధువు తల అడ్డంగా తిప్పుతూ వరుడి చెవిలో ఏదో అన్నది. పెళ్ళి పీటల మీద వధూవరులలా ఒకరి చెవిలో మరొకరు గుసగుసలాడుకోవడం చూసి, ఆహ్వానితులలో కొంతమంది 'ఔరా కలికాలం!' అంటూ ముక్కు మీద వేలేసు కొన్నారు.

బ్యాండ్ మేళం రొదలో యిష్ట మొచ్చినట్టు మంత్రాలు చదువుతున్న పురోహితుడు ఒక్కసారిగా మంత్రాలు ఆపి, వరుడు చెవి దగ్గరగా నోరు పెట్టి, "యిదిగో అబ్బాయ్! మీరలా చెవులు కొరుక్కోడానికి, పెదాలు కొరుక్కోడానికీ మరో ముహూర్తముంటుంది.' తంతులన్నీ పూర్తయ్యే వరకూ కాస్త ధ్యాసతో, నిగ్రహంతో ఉండండి. యింకెంత, రెండు నిముషాల్లో మంగళ సూత్ర ధారణ జరిపించేస్తాను. ఆపైన మీ యిష్టం," అని మందలించాడు. యిబ్బందిగా వధూవరులిద్దరూ నిటారుగా కూర్చున్నారు. పురోహితుడు మళ్ళీ మంత్రోచ్చారణని కుస్తీ పట్టసాగాడు.

మంగళ సూత్ర ధారణ తర్వాత వధూవరులిద్దరికీ ఓసారి పీటల మీద నుంచి లేచే అవకాశం రాగా, బ్యాండ్ మేళం వాళ్ళ దగ్గరకు పరుగెత్తి, వారంతకు ముందు వాయించిన పాట వివరాలడిగారు. ఆ మేళం నాయకుడు కుర్రాడు. "నాకు తెలియదీపాటేమిటో! పెళ్ళిళ్లలో ఈ ట్యూన్ వాయించాలన్నది నాలుగు దశాబ్దాలుగా మా టైగర్ బ్యాండ్ మేళం ఆనవాయితీ," అని సమాధానమిచ్చాడు కాస్త బేల ముఖంతో.

పురోహితుడు వాళ్ళిద్దర్నీ సంగతేమిటని ప్రశ్నించాడు. పీతాంబర్ విషయం చెప్పి వివరాలడిగాడు. పురోహితుడూ కుర్రాడే. "నాకు మట్టుకేం తెలుసు? బెల్లం జీల కర్ర ముద్దలు ఒకరి నెత్తిన మరొకరు పెట్టుకొనే పెళ్ళి ముహూర్తానికీ మంగళ సూత్ర ధారణకీ మధ్య ఈ పాటని ఈ టైగర్ బ్యాండ్ మేళం వారొక్కసారైనా వాయించకమానరు. యిదేదో మంగళ గీతమై ఉంటుంది" అన్నాడు.

ఈ భాగోతమంతా తీక్షణంగా గమనిస్తున్న ఓ పెద్ద మనిషి కుతూహలం ఆపుకోలేక వీళ్ళ

కొచ్చి విషయమేమిటని ప్రశ్నించాడు. శ్వేతాంబరి ఆ ట్యూన్ విషయమై అడిగింది. "ఓ అదా! కరీష్మా కపూర్ తాతయ్య రాజ్‌కపూర్, సంజయ్‌దత్ తల్లి నర్గీస్ 'ఆహ్' అనే హిందీ సినిమాలో నటించారు. అందులో ఈ పాట నర్గీస్ పాడుతుంది" అన్నాడు.

"అంకుల్, ఆ పాట చరణాలేమిటి?" శ్వేతాంబరి ప్రశ్నించింది.

"చూడమ్మాయ్, ఆ హిందీ పాట నాకు తెలియదు. కాని ఆ సినిమాని తెలుగులో ప్రేమలేఖలుగా డబ్బింగ్ చేశారు. ఆరుద్ర తెలుగులో మాటలూ, పాటలూ రాశాడు. పాట యిలా మొదలవుతుంది. 'పందిట్లో పెళ్ళవుతున్నదీ - కనువిందవుతున్నదీ - పూర్తి పాట మరిచిపోయాను" అన్నాడా పెద్ద మనిషి.

"శ్వేతూ, ఆడియో కేసెట్ కాని, సి.డి. కాని మ్యూజిక్ షాప్స్‌లో దొరుకుతుందేమో ఈ సాయంత్రం బజార్లో కొనుక్కుందాం," అన్నాడు పీతాంబర్.

"అంకుల్ ఆరుద్ర అంటే ఎవరు?" శ్వేతాంబరి ప్రశ్నించింది.

"ఆయనిప్పుడు లేరు. అసలు పేరు భాగవతుల శంకరశాస్త్రి. గొప్ప రచయిత. ఆయన భార్య కె. రామలక్ష్మిగారు కూడా మంచి రచయిత్రి" అన్నాడు.

"చూశావా పీతాంబర్? స్త్రీ వాదానికి మనముందు తరాల్లోనే పునాదులు పడ్డాయి. నేను కూడా మా యింటి పేరు మార్చుకోను, ముందస్తుగానే చెబుతున్నాను అంకుల్...."

అంకుల్ అక్కణ్ణుంచి చల్లగా జారుకొన్న సంగతి శ్వేతాంబరి కాస్త ఆలశ్యంగా గమనించింది. వీళ్ళకీ పాటల పిచ్చి ఏమిటా అనుకొంటూ పురోహితుడు కూడా అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు. వాస్తవానికి పీతాంబర్‌కీ, శ్వేతాంబరికీ అంత్యాక్షరి పాటల కార్యక్రమంలో పాల్గొనడానికి 'ఓ టీవి' కేంద్రానికి వెళ్ళినపుడు పరిచయమైంది. ఆ పరిచయం ప్రేమగా మారింది.

యిదే విషయమై సరిగా ఈ పెళ్ళి సమయంలో కళ్యాణ మండపంలో కొన్ని కుతంత్రాలు జరిగాయి. శ్వేతాంబరి తండ్రి సోదరి - అంటే మేనత్తకు పెళ్ళీడుకొచ్చిన కొడుకున్నాడు. తన కొడుక్కి యివ్వకుండా తమ్ముడూ వాళ్ళు పైసంబంధం చేసుకొన్నందుకు ఆవిడ మనసు కుతకుతలాడిపోయింది. ఆమె పెళ్ళికొడుకు మేనమామ భార్య దగ్గరకు వెళ్ళి, 'మా తమ్ముడికి యివ్వగల స్తోమత ఎంతో ఉంది. ఏ అచ్చటా ముచ్చటా

## ఏబాధాలేదు

ఇంతవరకు 'బిగ్ 'బి' గా వుంటూ రొమాంటిక్ పాత్రలు చేస్తూ ఏక్షన్ హీరోగా మీకు మీరే సాటి అనిపించుకున్న మీరు ఈరోజు సపోర్టింగ్ రోల్స్.... అదికూడా 'ముసలిపాత్రలు' చేయడం విషయంలో బాధపడటంలేదా ? అని అడిగితే అది ప్రకృతి సహజం వయసుని ఎవరాపగలరు? అయితే ముసలి పాత్రల్లో కనిపించడానికి సిద్ధపడటం మొదట కొంచెం కష్టంగానే వుంటుంది. ఒకసారి మెంటల్‌గా ప్రిపేరయితే ఏబాధా వుండదు. అయామ్ హ్యాపీ అంటాడు 'బిగ్ బి అమితాబ్'.

లేకుండా అన్నీ క్లుప్తంగా కానిచ్చేస్తున్నాడు. ఓ అలకపానుపా? ఓ వసంతాలా? మీ ఆడపడుచుతో చెప్పి వాళ్ళకుర్రాణి అలకపానుపు ఎక్కించమని చెప్పండి," అని గుట్టుగాహిత బోధ చేసింది.

ఈవిడకీ పెళ్ళీడుకొచ్చిన కూతురుంది. ఆడపడుచు తన కొడుక్కి పైసంబంధం చూసుకొన్నందుకు ఈవిడ మనసు భగభగమంది. వెంటనే వెళ్ళి, మాటలకి తేనె పూసి ఆడపడుచు చెవిలో నూరిపోసింది. "వదినా, నీకా ఒక్కగా నొక్క కొడుకు, ఈతరానికి మీ యింట్లో యిదే ఆఖరి వివాహం. మీ వియ్యాలవారు లేనివారేం కాదు. ముద్దూ ముచ్చటా తీరాలి కదా, అలకపానుపు ఏర్పాటు చేయించమని చెప్పు. వారేం యిచ్చినా యివ్వకపోయినా సరదా కోసమైనా ఈ తంతు కావాలని పట్టుబట్టు."

పీతాంబర్ తల్లి వెళ్ళి, వియ్యపురాలు అంటే శ్వేతాంబరి తల్లిని అలకపానుపు ఏర్పాట్లు చేయించమని కాస్త అథారిటీతోనే అడిగింది. శ్వేతాంబరి తల్లి కాస్త మనసులోనే నొచ్చుకొంటూ లేని నవ్వు తెచ్చుకొని, "వదినగారూ, అయిదు రోజుల పెళ్ళిళ్ళతో బాటే ఈ ఆనవాయితీలన్నీ మూల పడిపోయాయి. యివన్నీ కలిసే కదా కట్నాలు పెరిగిపోయాయి? యిప్పుడు మీరు అర్థాంతరంగా అలకపానుపూ అవీ అంటే....?" అని అర్థోక్తిగా ఆగిపోయింది.

పీతాంబర్ తల్లి ముఖ కవళికలు మారిపోయాయి. ఆమె ముఖంలోకి చూసిన శ్వేతాంబరి తల్లికి కూతురి కాపురం కళ్ళల్లో కదలాడింది. మనసు బిగపట్టి, మాట సవరించి అంది. "సర్లే దానికేంలెండి? వెళ్ళి మా ఆయనగారితో చెప్పి ఏర్పాట్లు చేయిస్తాను." ఆ తరవాత వెళ్ళి మొగుడితో మగ పెళ్ళి వారికోరిక తెలియజేసింది. ఆయన కాస్త తటపటాయించి" "అలాగే కానిద్దాం, తప్పుతుందా మరి?" అని ఆ ఏర్పాట్లలో మునిగిపోయాడు.

అప్పటికప్పుడు బజారుకి పంపించి ఓ ఫోల్డింగ్



నైలాన్ నవారు మంచం, బొంబేడైయింగ్ ప్రింటెడ్ దుప్పటి తెప్పించాడు. పీతాంబర్‌ని అలకపానుపు ఎక్కించారు. శ్వేతాంబరి కూడా అదే మంచం ఎక్కి కూర్చుంది. మేనత్త నంగనాచి కబుర్లకి లొంగిపోయిన శ్వేతాంబరి, మొగుడికి ముందరే 'కీ' యిచ్చి వదిలింది. అమ్మలక్కలు కాస్తంత గోల చేసిన తర్వాత అందరి చేతా బతిమాలించుకొని "ఎన్ ఫీల్డ్ మోటార్ బైక్" అన్నాడు. శ్వేతాంబరి "నాకూ కోప మొచ్చింది నాన్నా!" అంది. "ఏంకావాలి కన్నా?" అని శ్వేతాంబరి తల్లి ప్రశ్నించింది. "సోనీ హోమ్ థియేటర్ సిస్టం" కావాలమ్మా అంది గారాలు పోతూ.

శ్వేతాంబరి తండ్రి లోలోపలే వలవలా ఏడ్చుకొంటూ, షోరూమ్స్ నుండి రెండింటినీ తెప్పించాడు. శ్వేతాంబరి వదిన అంటే అన్న పెళ్ళాం మనసులోనే మెటికలు విరుచుకొంది, మొగుడికి మిగలాల్సిన సొమ్ముని ఆడపడుచు కోసం ఖర్చు పెట్టేసినందుకు. వదిన మొహం మాడ్డం చూసి శ్వేతాంబరి మనసూ, తమ్ముడికి మరోలకారం వదిలినందుకు శ్వేతాంబరి మేనత్త మనసూ నాట్యాలు చేశాయి.

మనుగుడుపులూ, అటుపైన మూడు రాత్రుళ్ళూ ముగిసిన తర్వాత, పీతాంబర్ శ్వేతాంబరిని తను ఉద్యోగం చేస్తున్న ఊరికి తీసుకుపోయి, పాలు పొంగించేసి కొత్త కాపురం పెట్టేశాడు.

కాపురం పెట్టిన మూడో రోజుకే శ్వేతాంబరికి విపరీతమైన పన్ను నొప్పి వచ్చింది. దానికి కారణం లేకపోలేదు. శ్వేతాంబరికి పైదవడలో కుడి వైపున మూల దంతం పిప్పిది. మూడు రాత్రుళ్ళూ పుల్లారెడ్డి మిఠాయిలూ, కాకినాడ కోటయ్య కాజాలూ, పెద్దాపురం పాలకోవాలూ ముద్దులతో సమానంగా

ఆరగించడం వల్ల, ఆ పిప్పి దంతం పిచ్చిగా నరాల్ని లాగేయడం మొదలు పెట్టింది. ఓ పక్కన బాధ భరించలేకా, మరో పక్క తనతో నోరు విప్పి అంత్యాక్షరి ఆడలేకా విలవిల లాడిపోతున్న భార్యని, పీతాంబర్ మోటారు సైకిలు మీద సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాలకి తీసుకుపోయాడు.

ఆ దంత వైద్యశాలలోని డాక్టర్లిద్దరూ దంపతులు. పెళ్ళాం డాక్టరు శ్వేతాంబరిని వాలు కుర్చీలో పడుకోబెట్టి, నోరు తెరిపించి స్పెషల్ ఫోకస్ లాంప్‌తో పరిశీలించి, పిప్పి దంతం మీద స్టెయిన్ లెస్ స్టీల్ పాయింటర్‌తో కెలికింది. శ్వేతాంబరి కెవ్వుమని అరవబోగా మందలించింది. 'అదేనా, అదేనా, ఆ పన్నేనా?' అంటూ డాక్టరు మరో అరడజను మార్లు కెలికింది. గుడ్ల నిండా నీళ్ళు కుక్కుకొని అవునన్నట్టుగా తలాడించింది. పెళ్ళాం డాక్టరు మొగుడు డాక్టరుతో గుసగుసలాడింది.

"రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్!" అన్నాడు మొగుడు డాక్టరు. ఎక్కడ లేని శక్తీ తెచ్చుకొని, బాధని అణుచుకొంటూ శ్వేతాంబరి గట్టిగా అరిచింది.

"నో,నో! నాకు వ్యవధి లేదు. నాలుగు రోజుల్లో అంత్యాక్షరి మెగాఫైనల్‌లో పాల్గొనాలి. రూట్‌తో సహా పన్ను పీకేయండి!"

బేరం బెడిసి కొట్టిందన్న దిగులుతో మొగుడు డాక్టరు మత్తెక్కే యింజక్షనిచ్చి ఆ పిప్పి దంతాన్ని పీకి ట్రేలో పడేశాడు. యింత దూది ఉండని ఆ దంతం పీకిన చోట కుక్కి, శ్వేతాంబరి నోరు మూయించి, పళ్ళు బిగించి రెండు గంటల సేపు ఉంచవలసిందని ఆదేశ మిచ్చాడు. "అసలు ఇన్‌ఫెక్షన్ తగ్గకుండా పన్ను పీకరు. మీరు అంత్యాక్షరి ప్రోగ్రాం అనడంతో ధైర్యం చేసి పీకేశాను. అందుకని చాలా పవర్ ఫుల్ ఆంటీ బయాటిక్స్ ప్రిస్క్రిప్షన్ రాస్తాను వాడండి" అన్నాడు. వంద రూపాయల బిల్లు పీతాంబర్‌కిచ్చింది రిసెప్షనిస్టు.

"పన్ను పీకడానికి అందరూ నలభయ్యే కదా తీసుకొనేది?" అని నసుగుతూ అడిగాడు.

"యిది సూపర్ స్పెషాలిటీ ఎ.సి. దంత వైద్య శాల. రిజిస్ట్రేషన్ ఫీజు యిరవై. అమ్మ డాక్టరు కన్సల్టేషన్ ఫీజు ముప్పై. అయ్య డాక్టరు పన్ను పీకి నందుకు ఏభై. వెరసి వంద" అంది రిసెప్షనిస్టు.

శ్వేతాంబరి పీతాంబర్ కేసి గుడ్లురిమి చూసింది. "అంత కట్నం గుమ్మరించాం. పెళ్ళాం పన్ను పీకించడం కోసం వందరూపాయల ఖర్చుంటే యింత ఏడుపా?" అన్నట్టున్నాయి ఆ గుడ్ల ఉరుములు. పీతాంబర్ మరి మారు మాట్లాడకుండా వంద నోటిచ్చి భార్యతో సహా బయట పడ్డాడు. అస్పత్రి అరుగు మీదే ఉన్న మందుల షాప్‌లో మందులూ, ఎందుకైనా మంచిదని ఓ కాటన్ రోలూ, ఓ లిస్టరిన్ మౌత్ వాష్ కొని, భార్య హేండ్ బాగ్‌లో ఉంచాడు.

స్టాండ్ తీసి మోటారు సైకిలు మీద కూర్చుని స్టార్ట్ చేశాడు. శ్వేతాంబరి వెనుక అడ్డంగా సీటు మీద కూర్చుంది. పీతాంబర్ బండిని పోనిచ్చాడు. కాస్త పరధ్యానంలో పడ్డ పీతాంబర్ ఎదురుగా దారి కడ్డంగా ఉన్న స్పీడ్ బ్రేకర్ని గమనించకపోవడంతో బండి ఎగిరిపడింది. కాస్త ఫ్రీగానూ, అజాగ్రత్తగానూ కూర్చున్న శ్వేతాంబరి ఆ కుదుపుకి రోడ్డు మీద పడింది. యిది గమనించని పీతాంబర్ ముందుకు పోయాడు.

కిందపడ్డ శ్వేతాంబరి అమ్మో అంటూ అరవడం, నోట్లో ఉన్న దూది బంతి రక్తపు ముద్దగా బయట పడ్డం జరిగింది. ఆ వెనువెంటనే దంతం పీకిన చోటు నుంచి రక్తం నోట్లోంచి బయటకు వచ్చి, గడ్డం మీదుగా కిందకి కారి ఆమె దుస్తులు రక్త సిక్తమయ్యాయి. తమ తమ పనుల ధ్యాసలో రోడ్డు మీద పోతున్న జనాలు ఈ సంఘటనని సరిగా చూడలేదు. వారనుకొన్నదేమిటంటే, మోటార్ సైకిలు మీద పోతున్న ఓ వ్యక్తి ఓ ఆడ మనిషిని గుద్దేసి, ఏం జరిగిందోనని వెనక్కి కూడా చూడకుండా ఉడాయించేస్తున్నాడు. "ఆ మోటారు సైకిల్ని ఆపండి, పట్టుకోండి" అని అరవసాగారు. ఎదురుగా వస్తున్న కొంతమంది చేతులు ఊపుతూ మోటారు సైకిలుకి అడ్డం రావడంతో పీతాంబర్ బండిని ఆపి ఆగాడు. ఈ లోపుగా వెనుక నుంచి కూడా జనం పరుగెత్తుకొంటూ వచ్చారు. పీతాంబర్‌ని కిందకు కాలరు పట్టుకొని లాగారు. బండి పక్కకి వాలి రోడ్డు మీద పడింది. జనాలు తమ చేతుల తీట వదుల్చుకోవడం కోసం పీతాంబర్‌కి దేహశుద్ధి చేశారు.

పీతాంబర్ చొక్కా, బనీన్లు చిరిగిపోయాయి. పెట్టుకొన్న చలవకళ్ళ జోడు బద్దలైంది. మరెవరో తమ దగ్గరున్న బ్లేడుతో మోటారు సైకిలు సీటు మీద గాట్లు పెట్టేశారు. యింకెవరో కింద పడి ఉన్న మోటారు సైకిలు రేర్ వ్యూ మిర్రర్‌ని బూటు కాలితో తన్ని కసి తీర్చుకొన్నాడు. యిదంతా క్షణాల్లో జరిగిపోయింది. ఏమైందోనని పీతాంబర్ ఆలోచించే లోపల, ఏం జరుగుతోందో శ్వేతాంబరి అవగాహన చేసుకొనే లోపల జరిగిపోయింది.

ఎవరో అందించిన చేయి ఆసరాగా పట్టుకొని లేచి నిలబడిన శ్వేతాంబరి, ఆ చెయ్యి పట్టు విదిలించుకొని భర్త వైపు పరుగెత్తింది. "ఆయన మా ఆయన! ఆయన్ని కొట్టకండి. ఇప్పుడే ఆ సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాలలో దంతాన్ని పీకించుకొన్నాను. నేను సరిగ్గా పట్టుకోకుండా కూర్చోడం వల్ల స్పీడ్ బ్రేకర్ దగ్గర కుదుపుకి కింద పడ్డాను. ఈ రక్తమంతా నేను పీకించుకొన్న దంతం చోటు నుంచి కారిందే తప్ప, దెబ్బలు తగిలికాదు!" అని గోల పెట్టింది.

"ఓర్ని, ఎంత పొరపాటైపోయింది! సారీ మేడమ్!" అంటూ అందరూ అక్కణ్ణుంచి చల్లగా జారుకొన్నారు.

పీతాంబర్ భార్య హేండ్ బాగ్‌లోంచి కాటన్ రోల్ తీసి, ఉసిరికాయంత దూది ఉండని చేసి, శ్వేతాంబరి నోట్లో దంతం పీకిన చోట అదిమి ఉంచి నోరు మూయించాడు. కిందపడిన బండిని లేవదీసి కూర్చుని స్టార్ట్ చేశాడు. పెళ్ళాం గట్టిగా తన్ను వాటేసుకు కూర్చున్న తర్వాత బండిని గేర్‌లో పెట్టి, యింటి ముఖం పట్టాడు ఏడుపుముఖంతో....

అలకపానుపు సరదా అలా తీరింది. ❋

## వదలలేని నమ్మకాలు

పాలల్లో చంద్రుణ్ని చూచి
నిందల పాలయ్యాడు
అలనాడు శ్రీకృష్ణుడు
నేను ఈనాడు
చవితి చంద్రుణ్ని చూచి
నీలాపనిందల పాయ్యాను
ఇది నాకున్న నమ్మకం
నాలో గాఢంగా పేర్కొన్న
మూఢ నమ్మకం
ఈ నమ్మకం
నా నరనరాల్లోకి
తర తరాల ప్రవహిస్తుంది
ఎన్నెన్ని చదువులు చదివినా
ఎంత రోదసి యుగంలో పయనించినా
చంద్రునిపై కాలు మోపి
స్టార్ హోటల్ పెట్టినా
వదలవు మనకున్న సెంటిమెంట్లు
వదలలేము
మనకున్న నమ్మకాలు
అనాదిగా వస్తున్న
మూఢ నమ్మకాలు

కె. మధుసూదన్